క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్‌వో నాయుడుకు చెక్కు అందజేస్తున్న దాత భవానీదేవి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని కొత్తజాలరిపేటకు చెందిన దుర్గాంభిక భవానీదేవి రూ. లక్ష విరాళాన్ని సింహగిరిపై పీఆర్‌వో నాయుడుకు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందించి దర్శనం కల్పించారు.

అనారోగ్య మహిళకు అండగా..



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పాపయమ్మ

ఎంవీపీకాలనీ: శివాజీ పాలెం కృష్ణ గుడి వెనుకాల నివాసం ఉంటున్న పాపయమ్మ అనారోగ్యానికి గురి కావటంతో ఆమెకు వార్డు అధ్యక్షుడు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ అండగా నిలిచారు. పాపయమ్మ కుటుంబ సభ్యులు ఎవరు ఇంట్లో లేకపోవటంతో ఆమెను కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం శ్రీకాకుళంలో ఉన్న పాపయమ్మ కుమార్తెకు సమాచారం అందించారు. ఆమె వచ్చే వరకు కేజీహెచ్‌లో ఉండి ఆర్థికసాయం చేశారు.


నేర నియంత్రణపై అవగాహన



బీచ్‌రోడ్డులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

ఎంవీపీకాలనీ: నేర నియంత్రణలో ప్రజలు సహకరించాలని ఈస్ట్ సబ్ డివిజన్ సీఐ ఎర్రంనాయుడు ప్రజలను కోరారు. నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్ ఆదేశాలు మేరకు బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో నేర నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని.. పండగలో ఊర్లో ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వారు కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

రేపటి నుంచి టన్నెల్ అక్వేరియం ప్రదర్శన



కనువిందు చేస్తున్న చేపలు

ఏయూ క్యాంపస్: బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ వెనుకనున్న ఏయూ మైదానంలో అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియంతో పాటు హ్యాండ్‌ల్యూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకుడు రాజారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఎగ్జిబిషన్ వేదికగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విదేశాలలో చూసే టన్నెల్ అక్వేరియంను తొలిసారిగా విశాఖ ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. వందల జాతులకు చెందిన చేపలు కనువిందు చేస్తాయన్నారు. శుక్రవారం నుంచి ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందని, సుమారు మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీని పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా నిపుణులైన సిబ్బంది నిరంతరం పని చేస్తారన్నారు. ఎమ్యూజిమెంట్ పార్క్‌లో గతంలో లేని విధంగా సునామీ, డ్రీమింగ్ టవర్, టిక్నో జంప్ వంటి 15 రైడ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు వందకుపైగా వస్త్ర, అలంకరణ, హస్తకళ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు.

సంబరాల సంక్రాంతి



భారతీ స్కూల్లో భోగి మంట వద్ద పాటలు పాడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అరిలోవ: నగరంలోని వివిధ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. టీఐసీ పాయింట్ దరి భారతీ విద్యానికేతన్‌లో విద్యార్థులు సందడి చేశారు. భోగి మంట వేసి, పరమాన్నం వండారు. చెరకు గడలు నైవేద్యం పెట్టి సంక్రాంతి పాటలతో సరదాగా గడిపారు. ఆదర్శనగర్‌లోని శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు జరిపారు. విద్యార్థులు గంగిరెద్దులు, బుడబుక్కలు, సోది చెప్పడం తదితర వేషధారణలో అలరించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న రంగవల్లులు

ఏయూక్యాంపస్: సంక్రాంతి శోభ ప్రతిబింబించే విధంగా పాఠశాలల చిన్నారులు తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఈస్ట్‌పాయింట్ కాలనీలోని



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న విద్యార్థులు

కేడీపీఎం పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన దీపిక, మౌనికలకు రొటేరియన్ రవికుమార్ బహుమతులుఅందజేశారు.పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రత్నం



ఆకట్టుకున్న శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థుల వేషధారణలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యుడు

తదితరులు పాల్గొన్నారు. జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో నిర్వహించిన సంక్రాతి వేడుకల్లో భాగంగా విద్యార్థినులు అందమైన రంగులతో రంగవల్లులు తీర్చిదిద్దారు.

బీవీకే పాఠశాలలో..

అరిలోవ: విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. బుడబుక్కల వేషాలు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల పాటలు, గోమాత పూజలు, భోగి మంటలు, విద్యార్థుల నృత్యాలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. వివిధ వేషధారణలో అలరించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేవీడీ మాధురి, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం జగన్‌ది జనరంజకపాలన



రవీంద్రనగర్‌లో మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న అక్కరమాని విజయనిర్మల

అరిలోవ: సీఎం జగన్‌ది జనరంజకపాలన అని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. పదో వార్డులో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రవీంద్రనగర్‌లో ఇంటింటికి వెళ్లి మహిళలు, వృద్ధులు, యువకులను ఆమె కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు అందించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పేదవారికి అనుకూలమైన పాలన అందిస్తున్నారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల అవసరాలు తీరుస్తున్నారన్నారు. అర్హులై ఉండి పథకాలు అందనివారు ఎవరైనా ఉంటే సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. దీంతో పాటు వార్డుల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, విద్యా విభాగం కార్పొరేషన్ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, వైదా నారాయణరావు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



15వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్

మద్దిలపాలెం: మహా నగరపాలక సంస్థ పరిధి 15వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులకు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల బుధవారం శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి వారు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 15వ వార్డులో రూ.17.80 లక్షల వ్యయంతో సింహాద్రిపురం, దుర్గానగర్, పాత వెంకోజీపాలెం ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక శాతం నిధులు కేటాయిస్తున్నారన్నారు. నగరాన్ని అభివృద్ధి పథంలో నడించాలనే సదుద్దేశంతో సీఎం పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అప్పారి గిరిబాబు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, నాయకులు సత్తిబాబు, ఏసురత్నం, వెంకటలక్ష్మి, రామచంద్ర, త్రినాథ్, నారాయణ రావు, సురేష్, నాయుడు, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మాస్టర్ ఈకే రచనలు అజరామరం



మాస్టర్ ఈకే ఆంగ్ల గ్రంథాలు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్ : మాస్టర్ ఈకే రచనలు అజరామరమని, ఆయన జీవన విధానం సాధకులకు మార్గదర్శకంగా ఉంటుందని కులపతి బుక్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు తెలిపారు. జిల్లా పరిషత్ సమీపాన గల జగద్గురుపీఠం, అంకోశ ఫంక్షన్ హాల్లో బుధవారం 62వ మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవాల్లో మాస్టర్ ఈకే గ్రంథాల ఆవిష్కరణోత్సవంలో పాల్గొని మాట్లాడారు. మాస్టర్ ఈకే శతాధిక గ్రంథాలు రాశారన్నారు. అందులో కొన్ని జర్మన్, స్పానిష్ భాషల్లో అనువదింపబడ్డాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎవెల్యూషన్ ఆఫ్ కాన్షెస్‌నెస్ ఆఫ్ మేన్ పుస్తకాన్ని, సైన్స్ ఆఫ్ యోగా పుస్తకాన్ని కోల్‌కతా ఇన్‌కంటాక్స్ కమిషనర్ బీఎస్‌ఎన్ రాజు, సింబాలిజమ్ ఆఫ్ స్క్రిప్చర్ గ్రంథాన్ని జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు గురుపూజలు నిర్వహించనున్నట్టు జగద్గురు పీఠం డైరెక్టర్ ఆఫ్ ఫంక్షన్స్ అజ్జరపు శ్రీనివాస్ తెలిపారు. దేశ విదేశాల నుంచి 1500 మంది సాధకులు పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుప్పట్ల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రముఖ సంఘ సేవకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని పారిశుధ్య సిబ్బందికి దుప్పట్లు అందజేశారు. అలాగే వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులకు ఆటోమేటిక్ కంప్యూటర్ కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేది పారిశుధ్య కార్మికలని, తన తండ్రిగారు ద్రోణంరాజు శ్రీనివాసరావు కూడా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికులదే ప్రథమ పాత్రని చెప్పేవారన్నారు. ఒకానొక సందర్భంలో వారి పాదాలు కూడా కడిగారని చెప్పారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపడుతున్న వివేకానంద సంస్థను అభినందించారు. ఈ సందర్భంగా 39వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగరాజుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, డీఎస్ అగర్వాల్, అప్పలకొండ, దూడ రాజు, ముత్యాలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అరిలోవ: అరిలోవ 12వ వార్డు పరిధి దుర్గానగర్‌లో నివాసితుల సంక్షేమ సేవా సంఘం ప్రతినిధుల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా వి.వాసు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా ఆర్.త్రిమూర్తి, ట్రెజరర్‌గా ఎస్.కొండబాబు, ఆర్గనైజర్‌గా కె.అప్పారావుతో పాటు మహిళా అధ్యక్షురాలిగా పద్మశ్రీ, వైస్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ వెంకటలక్ష్మిని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు వి.వాసు తెలిపారు.

నేటి నుంచి యువజనోత్సవాలు

మహారాణిపేట: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 26వ జాతీయ యువజనోత్సవాలు గురువారం నుంచి ఈనెల 16 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని హుబ్లీ–ధార్వాడ్‌లో గురువారం సాయంత్రం 4 గంటలకు జాతీయ యువజనోత్సవాలు–2023ను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్టు సెట్విస్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి పి.నాగేశ్వరరావు తెలిపారు. https// pmindiawebcast. in ద్వారా అందరు ఈ కార్యక్రమాన్ని వీక్షించవచ్చునని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

వాకర్స్ క్లబ్‌ల కార్యవర్గ ప్రమాణ స్వీకారం నేడు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ 2023 సంవత్సరానికి ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం వాకర్స్ పార్కులో గురువారం సాయంత్రం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. ఇదే వేదికపై మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. సభ్యులందరూ హాజరవ్వాలని ఆయన కోరారు.

వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులు



విజేతలకు నగదు బహుమతి, షీల్డ్ అందజేస్తున్న మరగడ అప్పారావు

పద్మనాభం: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని రేవిడిలో అనంత ఫ్యాషన్ దుస్తుల షాపు యజమాని ఆర్థిక సహకారంతో రెండు రోజుల పాటు భీమిలి నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల విజేతలకు బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మరగడ అప్పారావు నగదు బహుమతులు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పద్మనాభం జట్టుకు రూ.6 వేలు, ద్వితీయ స్థానం కృష్ణాపురం జట్టుకు రూ.3 వేలు, తృతీయ స్థానం మజ్జిపేట జట్టుకు రూ.2 వేల చొప్పున నగదు బహుమతి, షీల్డ్‌లు అందజేశారు.

రోబోటిక్ సాయిబాబాకు మేయర్ పూజలు



చినగదిలి ఆలయంలో రోబోటిక్ సాయిబాబాకు పూజలు చేస్తున్న మేయర్

అరిలోవ: రవిచంద్ ఆర్ట్స్ గ్యాలరీలో తయారు చేసిన రోబోటిక్ షిర్డీ సాయిబాబా విగ్రహాన్ని బుధవారం ఒక్కరోజు ప్రదర్శన కోసం చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాన్ని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దర్శించుకుని పూజలు చేశారు. ఈ విగ్రహం తయారీ విధానం తెలుసుకున్న ఆమె దాన్ని తయారు చేసిన రవిచంద్‌ను అభినందించారు. ఈ విగ్రహం మెడ నుంచి తల వరకు అటుఇటు కదులుతుంది. విగ్రహం నోరు కదులుతూ ఆ నోటి నుంచి సూక్తులు బయటికి వినిపిస్తున్నాయి. రెండు కళ్లు తెరవడం.. ఆర్పడం జరుగుతుంది. ఈ విగ్రహం తయారీకి రూ.7 లక్షలు ఖర్చు అయినట్లు రవిచంద్ తెలిపారు. విగ్రహం తయారు చేయడానికి మూడు సంవత్సరాలు పట్టినట్లు తెలిపారు. రెండు రోజుల్లో చింతపల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి విగ్రహాన్ని తరలిస్తున్నట్లు తెలిపారు. రోబోటిక్ విగ్రహం ఉన్నట్లు తెలుసుకున్న స్థానికులు సాయిబాబా మాట్లాడుతున్నాడంటూ గుంపులు గుంపులుగా ఆలయానికి వచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో మేయర్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఆలయ చైర్మన్ వానపల్లి అప్పారావు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లు మెరుగైన సేవలందించాలి



శిక్షణ పొందిన ఆశ కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అరిలోవ: శిశు సంరక్షణలో ఆశ వర్కర్లు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. పైనాపిల్‌కాలనీ వద్ద గల జిల్లా మహిళా ప్రాంగణంలో 10 రోజుల పాటు జరిగిన ఆశా కార్యకర్తల ప్రత్యేక శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పొందిన ఆశా కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు శిశు మరణాలు జరగకుండా ఆశ కార్యకర్తలు కృషి చేయాలని, దానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భిణులను నిరంతరం పరిశీలించి, వారికి ఆరోగ్య పరీక్షలు చేస్తుండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేటట్లు ప్రయత్నించాలన్నారు. ప్రతి నెలా 9న నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సురక్షిత అభియాన్ ప్రోగ్రాంలో గర్భిణులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఆరోగ్య విద్యాధికారి కె.ధర్మేంద్ర, డీపీహెచ్‌ఎన్‌వో సత్యవతి, హెచ్‌ఈ లక్ష్మి, మహిళా ప్రాంగణం మేనేజర్ పి.విమలకుమారి పాల్గొన్నారు.

క్లీన్ విశాఖే ధ్యేయం కావాలి



బెలూన్లు ఎగురవేసి బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరివెంటకుమారి

అరిలోవ: విశాఖను పరిశుభ్రంగా తీర్చిదిద్ది పర్యాటకులను ఆకట్టుకునే విధంగా మలిచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా ఉండాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. ఆకాష్ బైజూస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెంలో బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరులు సామాజిక బాధ్యతతో మెలిగి విశాఖను స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. బీచ్‌తో పాటు అన్నిచోట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులు, విద్యా సంస్థల సిబ్బంది కలిసి జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు దిగువున బీచ్ క్లీనింగ్ చేశారు. పాలిథిన్ కవర్లు, కాగితాలు, పిచ్చి మొక్కలు, పేపర్ ప్లేట్లు, సేకరించి బయటికి తరలించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల రీజనల్ డైరెక్టర్ ధీరజ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల అలంకరణలో శ్రీనివాసుడు



ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న అంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ ఆండాళ్ రచించిన తిరుప్పావై 27వ పాశుర విన్నపాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూడారై పాయసాన్ని 108 వెండి గంగాళాలలో స్వామివారికి నివేదించారు. అనంతరం భక్తులకు ఆ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ వేడుకలో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని అరటి, దానిమ్మ, బత్తాయి, పైనాపిల్ తదితర ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదంతో పాటు ఆయా ఫలాలను భక్తులకు పంపిణీ చేశారు.

వైభవంగా కుడారై ఉత్సవం

ఘనంగా ధనుర్మాసం 28వ రోజు పూజలు



విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి



ప్రసన్న వేంకటేశ్వరస్వామి, గోదాదేవి ఉత్సవ విగ్రహాల వద్ద నివేదించిన కుడారై పాయసం కుండలు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 28వ రోజు కార్యక్రమంలో భాగంగా కుడారై ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. తెల్లవారు జాము 5 గంటల నుంచి స్వామి వారికి తిరుప్పావై 28వ పాశురం విన్నవించుకున్నారు. ఆలయ అర్చకుడు గౌడవర్తి రాఘవాచార్యులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, గోదాదేవి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తయారు చేసిన కుడారై పాయసాన్ని 108 మట్టి కలశాలలో నివేదించారు. ఈ సందర్భంగా భక్తుల ఓం నమో వేంకటేశాయ నామంతో ఆ ప్రాంతం మార్మోగింది. భక్తులకు అంతరాలయ దర్శనం కల్పించిన అనంతరం పాయశంతో కూడిన కుండలను పంపిణీ చేశారు.

అలిమేలు మంగమ్మ ఆలయంలో..

వెంకటేశ్వరమెట్టపై గల అలిమేలు మంగమ్మ ఆలయంలో గోదాదేవికి కుడారై సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పి.కేశవాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. పెళ్లి కావాల్సిన ఆడపిల్లలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుడారై పాయసం భక్తులకు పంపిణీ చేశారు. భక్తులు గోవిందుడిని స్తుతిస్తూ భక్తి గీతాలు పాడి సందడి చేశారు.

రామాలయానికి మైక్ సెట్ వితరణ

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు ఎస్సీ కాలనీలో గల శ్రీ రామ, సాయిబాబా ఆలయానికి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు బుధవారం మైక్‌సెట్, యాంప్లిఫైర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ప్రత్యేకంగా ఆహ్వానం పలికి, ఆయన పేరిట భగవంతునికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సహాయం అడగ్గానే అందజేసిన కందుల నాగరాజుకు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కందుల నాగరాజు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాధురి, లక్ష్మీకాంతం, రవణమ్మ, త్రివేణి, తిరుమల, లక్ష్మి, తెలుగు అర్జున్, ఆదిబాబు, 32వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి కందుల బద్రీనాథ్, కందుల కేదారనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 7.6 లక్షలు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. 26 రోజులకుగాను అమ్మవారి దర్శనాలకు సంబంధించిన హుండీల ఆదాయం రూ.7,68,361 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎల్ నరసింహం పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు.

విద్యార్థులకు పుస్తకాలు, పలకల పంపిణీ



విద్యా సామగ్రి అందుకున్న పిల్లలతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెం పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు బుధవారం విద్యా సామగ్రిని పంపిణీ చేశాయి. గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లను అందించాయి. ఈ సందర్భంగా సర్పంచ్ భావిశెట్టి భారతమ్మ, ఉప సర్పంచ్ మరుపిళ్ల నిర్మలమ్మ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులకు సాయం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారిని చైతన్య పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉప్పాడ అప్పారావు, పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్, హెచ్‌ఎం రోజారాణి తదితరులు పాల్గొన్నారు.